

జగనన్న సురక్షతో లబ్ధి


ధ్రువీకరణ పత్రాన్ని అందజేస్తున్న రంగారెడ్డి

నెల్లూరు రూరల్: జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అన్ని వర్గాల ప్రజలకు లబ్ధి చేకూరుతోందని విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి పేర్కొన్నారు. పెనుబర్తి సచివాలయంలో మంగళవారం నిర్వహించిన జగనన్న సురక్ష కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. రానున్న ఎన్నికల్లో నెల్లూరు రూరల్ నియోజకవర్గం నుంచి వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అభ్యర్థిగా పోటీ చేయనున్న ఆదాల ప్రభాకర్‌రెడ్డిని భారీ మెజార్టీతో గెలిపించాలని కోరారు. అనంతరం ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. రూరల్ ఎంపీపీ విజయ్‌కుమార్, వైస్ ఎంపీపీ రవీంద్రరెడ్డి, పెనుబర్తి, మాదరాజుగూడూరు సర్పంచ్‌లు వెదనపర్తి సుజనమ్మ, చిట్టిబోయిన వెంకటేశ్వర్లు, నేతలు వెంకటేశ్వర్లురెడ్డి, రామ్‌ప్రసాద్‌రెడ్డి, వీరరాఘవరెడ్డి, రూరల్ ఇన్‌చార్జి ఎంపీడీఓ శైలేంద్రకుమార్ పాల్గొన్నారు.

- రూరల్ నియోజకవర్గ పరిధిలోని 23, 35వ డివిజన్లలో నిర్వహించిన కార్యక్రమంలో విజయ డెయిరీ చైర్మన్ రంగారెడ్డి, కమిషనర్ వికాస్ మర్మత్, కార్పొరేటర్లు శ్రీనివాసులురెడ్డి, వాసంతి, తదితరులు పాల్గొన్నారు.

సీఎంను కలిసిన రూప్‌కుమార్‌యాదవ్



నెల్లూరు(దర్గామిట్ట): సీఎం జగన్‌మోహన్‌రెడ్డిని తాడేపల్లిలోని ఆయన నివాసంలో డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్‌యాదవ్ మర్యాదపూర్వకంగా మంగళవారం కలిశారు. పలు అభివృద్ధి పనులపై చర్చించారు.

గుర్తుతెలియని వ్యక్తి మృతి



నెల్లూరు(క్రైమ్): గుర్తుతెలియని వ్యక్తి అనారోగ్యంతో మృతి చెందిన ఘటన వేదాయపాళెం రైల్వేస్టేషన్లోని ఒకటో నంబర్ ప్లాట్‌ఫారంపై మంగళవారం చోటుచేసుకుంది. మృతుడు 40 నుంచి 45 ఏళ్ల వయస్సు కలిగి.. నలుపు రంగుపై గ్రే రంగు డిజైన్ లుంగీని ధరించి ఉన్నారు. ఘటనపై రైల్వే పోలీసులకు స్టేషన్ సిబ్బంది సమాచారం అందించారు. ఎస్సై హరిచందన ఘటన స్థలానికి చేరుకొని మృతదేహాన్ని పరిశీలించారు. మృతుడి వద్ద ఎలాంటి వివరాలు లభ్యం కాలేదు. దీంతో మృతదేహాన్ని జీజీహెచ్ మార్చురీకి తరలించారు. మృతుడి వివరాలు తెలిసిన వారు నెల్లూరు రైల్వే పోలీసులను సంప్రదించాలని కోరారు.

28న జూనియర్ కళాశాలల బంద్


పోస్టర్లను ఆవిష్కరిస్తున్న నేతలు

నెల్లూరు (టౌన్): ప్రభుత్వ, ప్రైవేట్ జూనియర్ కళాశాలల్లో సమస్యలను పరిష్కరించాలని కోరుతూ బంద్‌ను ఈ నెల 28న నిర్వహించనున్నామని ఏబీవీపీ రాష్ట్ర సంయుక్త కార్యదర్శి రాజశేఖర్ పేర్కొన్నారు. కార్యక్రమానికి సంబంధించిన పోస్టర్లను స్టోన్‌హౌస్‌పేటలోని ఆర్‌ఐఓ కార్యాలయ ఎదుట ఆవిష్కరించారు.

నిత్యావసర సరుకుల అందజేత



నెల్లూరు రూరల్: ధనలక్ష్మీపురానికి చెందిన హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ అధ్యక్షుడు కుంచాల విజయభాస్కర్ తన జన్మదినాన్ని పురస్కరించుకొని పలు సేవా కార్యక్రమాలను మంగళవారం చేపట్టారు. కోవూరు సమీపంలోని న్యూ లైఫ్ చిల్డ్రన్స్ హోమ్‌కు నిత్యావసర సరుకులను అందజేశారు.

విద్యార్థులకు న్యాయం చేయరూ..

నెల్లూరు (టౌన్): వీఆర్ లా కళాశాలలో మూడో సెమిస్టర్ చదువుతున్న విద్యార్థులకు యాజమాన్యం న్యాయం చేయాలని స్టేట్ ఎడ్యుకేషన్, మెడికల్ అండ్ లీగల్ రైట్స్ అసోసియేషన్ (సెమ్లా) అధ్యక్షుడు రేశ్వంత్ కోరారు. ఈ మేరకు కళాశాల ఎదుట నిరసనను చేపట్టారు.

విద్యా ప్రమాణాల మెరుగునకు డిజిటల్ బోధన

బుచ్చిరెడ్డిపాళెం : విద్యా ప్రమాణాలను మెరుగుపరిచేందుకు రాష్ట్ర ప్రభుత్వం పాఠశాలల్లో డిజిటల్ విద్యాబోధనను ప్రవేశపెట్టిందని ఎంఈఓ–2 వెంకటరత్నం తెలిపారు. బుచ్చిరెడ్డిపాళెం నగర పంచాయతీ పరిధిలోని బెజవాడ బుజ్జమ్మ బాలికోన్నత పాఠశాలలో డిజిటల్ విద్యాబోధనపై ఉపాధ్యాయులకు మంగళవారం ఒకరోజు శిక్షణ తరగతులను నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బెస్ట్ అసిస్మెంట్, టోఫెల్, స్మార్ట్‌టీవీ, ఇంటరాక్టివ్ ఫ్లాట్ ప్యానల్ వంటి వాటితో విద్యార్థుల్లో విద్యా సామర్థ్యాన్ని మరింత పెంపొందించేందుకు అవకాశం ఉంటుందన్నారు. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో సెమిస్టర్–2 పాఠ్య పుస్తకాలను అందజేశామని తెలిపారు. విద్యార్థులు ఒక్కరోజు పాఠశాలకు రాకపోయినా వారి తల్లిదండ్రులకు ఫోన్ చేసి సమాచారం సేకరించే బాధ్యత ఉపాధ్యాయులు తీసుకోవాలని కోరారు. ఈ కార్యక్రమంలో ఇన్‌చార్జి హెచ్‌ఎం శ్రీనివాసన్, రిసోర్స్‌పర్సన్ సుధీర్‌కుమార్, జాయింట్ సెక్రటరీ ప్రసాద్, సీఆర్పీలు మహేష్, మల్లేశ్వర్‌రెడ్డి, ఉపాధ్యాయులు, తదితరులు పాల్గొన్నారు.

రుణ పరిమితిని పెంచుకోవాలి

కొడవలూరు: పొదుపు సభ్యులు తమ రుణ పరిమితిని పెంచుకోవాలని వైఎస్సార్ క్రాంతి పథం ఏపీఎం ఎస్.రుక్మిణి తెలిపారు. స్థానిక వైఎస్సార్ క్రాంతి పథం కార్యాలయంలో సంఘ బంధం వీఓఏలు, సంఘమిత్ర కార్యవర్గ సభ్యులకు ఆర్థిక కార్యకలాపాల నిర్వహణపై మంగళవారం శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ పొదుపు సభ్యత్వం అనివార్య కారణాల వల్ల రద్దయినా లేక రద్దు చేసుకున్నా వారు చెల్లించిన పొదుపు మొత్తాన్ని తిరిగి చెల్లిస్తామని చెప్పారు. రద్దయినప్పుడు చెల్లించే మొత్తానికి ఎలాంటి వడ్డీ ఉండదన్నారు. ఎంత మొత్తం కట్టి ఉంటే అంతే చెల్లిస్తామన్నారు. పొదుపును పెంచుకుంటే ఒక్కో సభ్యురాలు రూ.1.50 లక్షల రుణం పొందే వెసులుబాటు కల్పించినట్లు తెలిపారు. ప్రతి సభ్యురాలు రూ.1.50 లక్షల రుణం పొందేందుకు అర్హత సాధించాలని సూచించారు. కార్యక్రమంలో సంఘమిత్ర అధ్యక్ష, కార్యదర్శులు కోటేశ్వరమ్మ, సుశీల, సీసీలు కె.ఉదయ్‌కుమార్, మమత, శ్రీదేవి, శోభ, సుకన్య, తదితరులు పాల్గొన్నారు.

అధిక ఫీజులను నియంత్రించాలి

నెల్లూరు(వీఆర్సీసెంటర్): రాష్ట్రంలో ప్రైవేట్, కార్పొరేట్ విద్యాసంస్థలు వసూలు చేస్తున్న అధిక ఫీజులను నియంత్రించాలని ఎన్‌ఎస్‌యూఐ, ఆర్‌ఎస్‌యూ సంఘాల నేతలు డిమాండ్ చేశారు. స్టోన్‌హౌస్‌పేట సమీపంలోని కేఏసీ ప్రభుత్వ జూనియర్ కళాశాల వద్ద బంద్‌ను మంగళవారం నిర్వహించారు. ఎన్‌ఎస్‌యూఐ జిల్లా అధ్యక్షుడు రాజా, ఆర్‌ఎస్‌యూ రాష్ట్ర అధ్యక్షుడు రవిశంకర్‌రెడ్డి, నేతలు గణేష్, జశ్వంత్, బాలాజీ, నాగేశ్వరరావు, కుమార్, తదితరులు పాల్గొన్నారు.

కమ్యూనిటీ హాల్‌కు స్థలాన్ని కేటాయించాలని వినతి


అనిల్‌కుమార్‌కు వినతిపత్రమిస్తున్న నేతలు

నెల్లూరు (వేదాయపాళెం): నూర్‌బాషా కమ్యూనిటీ హాల్‌కు స్థలాన్ని కేటాయించాలని నూర్‌బాషా ముస్లిం సంక్షేమ సంఘ అధ్యక్షుడు సలీం కోరారు. ఈ మేరకు నెల్లూరు నగర ఎమ్మెల్యే అనిల్‌కుమార్‌కు నగరంలోని ఆయన నివాసంలో వినతిపత్రాన్ని మంగళవారం అందజేశారు. నూర్‌బాషా సంఘ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ ఖాదర్‌బాషా, ఆర్గనైజింగ్ సెక్రటరీ బాబర్‌జాన్, మస్తాన్ సాహెబ్, మస్తాన్, మహిళాధ్యక్షురాలు షాకీరా, లతీష్, మౌలాలీ, తదితరులు పాల్గొన్నారు.

బ్రిడ్జిల్లో నీరు నిల్వ ఉండకూడదు



నెల్లూరు(బారకాసు): వర్షాలతో ప్రజాజీవనానికి అంతరాయం కలగకుండా చర్యలు చేపట్టడంతో పాటు వర్షపు నీరు అండర్ బ్రిడ్జిల్లో నిల్వ ఉండకుండా చర్యలు చేపట్టాలని కమిషనర్ వికాస్ మర్మత్ ఆదేశించారు. నగరంలోని వివిధ ప్రాంతాల్లో డ్రెయిన్లు, లోతట్టు ప్రాంతాలు, మాగుంట లేఅవుట్, విజయమహల్‌గేట్, రామలింగాపురం అండర్ బ్రిడ్జిల వద్ద గల పంపింగ్ స్టేషన్లను అధికారులతో కలిసి పరిశీలించిన అనంతరం ఆయన మాట్లాడారు. కార్పొరేషన్ సిబ్బంది యుద్ధప్రాతిపదికన సేవలందించేందుకు సిద్ధంగా ఉండాలని ఆదేశించారు. వర్షపు నీరు నిల్వ ఉండకుండా మోటార్ల ద్వారా ఎప్పటికప్పుడు తోడేయాలని సూచించారు.

- నగరంలోని 36 / 3 ఫతేఖాన్‌పేట, 37 / 2 రామ్‌నగర్ సచివాలయాలను కమిషనర్ తనిఖీ చేశారు. కార్పొరేటర్ బొబ్బల శ్రీనివాస్‌యాదవ్ పాల్గొన్నారు.
- వెంకటేశ్వరపురంలోని జగనన్న లేఅవుట్‌ను హౌసింగ్ విభాగం, ఎస్పీడీసీఎల్, ఇరిగేషన్, నగరపాలక సంస్థ అధికారులతో కలిసి కమిషనర్ పరిశీలించారు. అదనపు కార్మికులతో పనులను వేగవంతం చేయాలని ఆదేశించారు.
- బారాషహీద్ దర్గాలో రొట్టెల పండగ ఏర్పాట్లను కమిషనర్ పరిశీలించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అన్ని చర్యలు చేపడుతున్నామని వివరించారు.

అర్హులందరికీ సంక్షేమ పథకాలు



నెల్లూరు(బారకాసు): జగనన్న సురక్ష కార్యక్రమం ద్వారా అర్హులందరికీ సంక్షేమ పథకాలను అందించడం సాధ్యమవుతుందని కమిషనర్ వికాస్ మర్మత్ పేర్కొన్నారు. నగర నియోజకవర్గ పరిధిలోని 11వ డివిజన్‌కు సంబంధించి ఎన్టీఆర్‌నగర్, 54వ డివిజన్‌కు సంబంధించి జనార్దన్‌రెడ్డి కాలనీలో జగనన్న సురక్ష కార్యక్రమాలను మంగళవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు. జగనన్న సురక్ష శిబిరాల్లో ఏర్పాటు చేసిన స్పందన కౌంటర్, హెల్ప్, రిజిస్ట్రేషన్ డెస్కుల ద్వారా అన్ని రకాల సేవలను అందిస్తున్నామని వెల్లడించారు. అన్ని కేంద్రాల్లో ఆధార్ అప్‌డేట్ సెంటర్, మెడికల్ క్యాంపులను ఏర్పాటు చేశామని వివరించారు. అనంతరం టోకెన్ల ఆధారంగా లబ్ధిదారులకు ధ్రువీకరణ పత్రాలను అందజేశారు. కార్పొరేటర్లు అరుణ, సఫియా బేగం, తదితరులు పాల్గొన్నారు.

వృద్ధాశ్రమంలో అన్నదానం

నెల్లూరు(బృందావనం): పొదలకూరు రోడ్డులోని గౌతమ్‌నగర్‌లో గల హరిత వృద్ధాశ్రమంలో అన్నదాన కార్యక్రమాన్ని ప్రశాంత్ మెమోరియల్ సోషల్ సర్వీస్ ఆధ్వర్యంలో మంగళవారం నిర్వహించారు. అల్లూరి సీతారామరాజు ఫౌండేషన్ చైర్‌పర్సన్ రమాదేవి ఆధ్వర్యంలో నిర్వహించిన కార్యక్రమంలో ఆశ్రమ నిర్వాహకురాలు రాజేశ్వరి, నారాయణ దంత వైద్యశాల హెచ్‌ఓడీ కణ్ణన్, జయప్రకాష్, వీరేంద్ర, శరణ్య, కీర్తన, ఈశ్వర్, తదితరులు పాల్గొన్నారు.





























